# Eenadu

# కొత్త కొలువులకు 4 విధానాలు

- డేటా అనలటిక్స్, సైబర్ సెక్యూరిటీ, డేటాసెంటర్స్, ఓపెన్ డేటా
- ఆవిష్కరించిన తెలంగాణ ఐటీ మంత్రి కేటీఆర్
- 'యాంత్రీకరణ'ను అధిగమించేందుకు ప్రత్యామ్నాయ చర్యలు



పారిశ్రామిక దిగ్గజాలతో కలిసి సైబర్ భద్రత విధానాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి కేటీఆర్

ఈనాడు - హైదరాబాద్

యాంత్రీకరణ (ఆటోమేషన్), రోబోటిక్స్‌ల కారణంగా ఉద్యోగాలు తగ్గిపోతున్నాయని ఆందోళన చెందుతున్న వేళ... ఆ భయాన్ని దూరం చేస్తూ, కొత్త కొలువులకు బాటలు వేస్తూ తెలంగాణ ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాన్ని సిద్ధం చేస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఎదుగుతున్న డేటా రంగాన్ని ప్రోత్సహిస్తూ నాలుగు సమాచార సాంకేతిక విధానాలకు శ్రీకారం చుట్టింది. ప్రపంచ ఐటీ రంగంలో ప్రస్తుతం అందరినోటా విన్పిస్తున్న 'డేటా' మంత్రాన్ని ఆచరణలో పెట్టేందుకు వీలుగా... దేశంలోనే తొలిసారిగా డేటా అనలటిక్స్, సైబర్ సెక్యూరిటీ, డేటా సెంటర్స్, ఓపెన్ డేటాలపై కార్యాచరణ ప్రణాళికలను పారిశ్రామిక దిగ్గజాలు, విద్యారంగ ప్రముఖుల సమక్షంలో తెలంగాణ ఐటీశాఖ మంత్రి కేటీఆర్ గురువారం ఆవిష్కరించారు. ఆయా రంగాల్లోని కొన్ని కంపెనీలతో కలసి (మిగతా 2లో)

# కొత్త కొలువులకు 4 విధానాలు

(మొదటి పేజీ తరువాయి)

పనిచేయటానికి ఒప్పందాలు కూడా కుదుర్చుకున్నారు. గురువారం ఆవిష్కరించిన నాలుగు విధానాలు... వాటి ప్రభావాలు క్లుప్తంగా...

## 1. సైబర్ భద్రత విధానం

ప్రపంచవ్యాప్తంగా ఐటీ, ఐటీ ఆధారిత సేవలకు సవాలు విసురుతున్నది సైబర్ చౌర్యం. దీన్ని నివారించి, భద్రత కల్పించేదే సైబర్ సెక్యూరిటీ. ఒకరకంగా చెప్పాలంటే సైబర్ రంగంలో శాంతిభద్రతలను పర్యవేక్షించే పోలీసు బలగమిది! ఇందులో నిపుణులకు బోలెడంత గిరాకీ! ఈ రంగంలో పరిశోధనలను ప్రోత్సహించటం, నిపుణులను తయారు చేసి సురక్షిత సైబర్ వాతావరణాన్ని కల్పించటం లక్ష్యం.

- సైబర్ భద్రత గురించి అందరికీ అవగాహన కల్పిస్తారు.
- సైబర్ నేరాలను నిరోధించటానికి చట్టపరమైన ప్రణాళికను రూపొందించి... సంస్థలను ఏర్పాటు చేస్తారు. అవసరమైన నిపుణులను తయారు చేస్తారు. ఇందుకోసం కొత్త కోర్సులు ఆరంభిస్తారు.
- ఈ రంగంలో అంకుర పరిశ్రమలను, ఉత్పత్తులను ప్రోత్సహిస్తారు.
- సైబర్ ఫోరెన్సిక్ ల్యాబ్ ఏర్పాటు చేస్తారు.
- సైబర్ సెక్యూరిటీకి సంబంధించి టాస్క్ ద్వారా సర్టిఫికెట్ కోర్సులు. యూనివర్సిటీల ద్వారా మాస్టర్స్, డిగ్రీ, డిప్లొమా కోర్సులు.

**ప్రయోజనం:** ఈ రంగానికి ప్రోత్సాహం వల్ల సైబర్ నేరాల కట్టడితోపాటు... ప్రపంచవ్యాప్తంగా సైబర్ భద్రత రంగంలో తలెత్తుతున్న ఉపాధిని అందుకునే అవకాశం స్థానిక యువతరానికి లభిస్తుంది.

## 2. డేటా అనలటిక్స్

దుకాణాల్లో, షాపింగ్ మాల్స్‌లో మనం చేసే కొనుగోళ్లు, కొనకున్నా చూసి వదిలేసినవీ... బడుల్లో నమోదులు.. వివిధ సర్వేల్లో కళ్లముందు కన్పించే అంకెలు.. ఇలా ప్రతిదీ సమాచారమే! వాటిని విశ్లేషిస్తే కంపెనీలకు, ప్రభుత్వానికి లాభాలు బోలెడు. అదే ఇప్పుడు డేటా అనలటిక్స్‌గా... ప్రతి రంగంలోనూ ప్రాధాన్యాంశమై నిలుస్తోంది. ప్రపంచవ్యాప్తంగా లక్షల ఉద్యోగాలకు వేదికవుతోంది. ఈ రంగంలోని కంపెనీలను ఆకర్షించేలా.. ఉద్యోగాలకు నిపుణులను తయారుచేసేలా వ్యవస్థలను ఏర్పాటు చేస్తారు.

- సకల సదుపాయాలతో హైదరాబాద్‌లో డేటా అనలటిక్స్ పార్క్ ఏర్పాటు.
- డేటా సైన్సెస్‌లో శిక్షణనిచ్చి నిపుణులను తయారు చేయడం.
- ఈ రంగంలో ముందుకొచ్చే అంకురాలకు, మధ్య, సూక్ష్మస్థాయి పరిశ్రమలకు ప్రోత్సాహం. వారి ఉత్పత్తుల కోసం ఓ వాణిజ్య విభాగం ఏర్పాటు.
- స్మార్ట్ పాలనకు వీలుగా... ప్రభుత్వానికి కూడా ఉపయోగపడేలా డేటా విశ్లేషణ విభాగం ఏర్పాటు.

**ప్రయోజనం:** ఐటీరంగంలో ప్రస్తుతం డిమాండ్‌లో ఉన్న అనలటిక్స్ కంపెనీలు ఇక్కడికి రావటానికి.... అందులో వస్తున్న ఉద్యోగాలు అందుకోవటంలో యువతరానికి దోహదపడుతుంది.

## 3. డేటా సెంటర్లు

డేటా సేకరణ, విశ్లేషణ ఒకెత్తైతే... దాన్ని నిక్షిప్తం చేయడం మరో భారీ అంశం. మారుతున్న చట్టాల ప్రకారం... ఏ భౌగోళిక ప్రాంతంలోని డేటా అక్కడే ఉండాల్సిన పరిస్థితులు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో డేటా సెంటర్లు కీలకం కాబోతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఐటీ విధానాల్లో డేటా సెంటర్లకు ప్రాధాన్యం పెరిగింది. అందుకే... తెలంగాణలో డేటాసెంటర్ల ఏర్పాటుకు ప్రోత్సహిస్తున్నారు. ముందుకు వచ్చే కంపెనీలకు ప్రోత్సాహకాలు అందిస్తారు. తక్కువ ధరకు భూమి కేటాయిస్తారు. హైస్పీడ్ ఇంటర్నెట్, నిరంతర నీరు, ఇంధన సరఫరా... తదితరాలు సబ్సిడీ ధరలకు అందిస్తారు.

**ప్రయోజనం:** డేటాసెంటర్లకు కావల్సిన హార్డ్‌వేర్ తయారీ స్థానికంగా పుంజుకునే అవకాశముంది. ఇది సూక్ష్మ, మధ్యతరగతి కంపెనీలకు ప్రోత్సాహకరం. తద్వారా ఉపాధికి అవకాశం.

## 4. ఓపెన్ డేటా

ప్రభుత్వం వద్ద దస్త్రాల్లో దాగున్న సమాచారాన్ని అందరికీ అందుబాటులో ఉంచే ఈ రకమైన విధానం తీసుకొస్తున్న రెండోరాష్ట్రం తెలంగాణ. పాలనాపరమైన నిర్ణయాలు తీసుకోవటంలో... సుపరిపాలన అందించటంలో, అభివృద్ధిలో, సంక్షేమంలో ఈ విధానం కీలక మార్పులకు కారణమవుతుంది. రాష్ట్రస్థాయి నుంచి పంచాయతీలదాకా సమాచార విశ్లేషణ జరుగుతుంది.

**ప్రయోజనం:** సమాచారాన్ని సరైన విధంగా క్రోడీకరించి, విశ్లేషించటం వల్ల సమస్యల పరిష్కారానికి వీలవుతుంది. ఉదాహరణకు... జీహెచ్ఎంసీలో రోజూ చాలా ఫిర్యాదులొస్తాయి. వాటిలో హైదరాబాద్‌లోని ఒక ప్రాంతం నుంచి పదేపదే ఫిర్యాదులొస్తున్నట్లయితే... అన్నిసార్లు అక్కడి నుంచే ఎందుకు వస్తుందో చూసి.... దానిపై యంత్రాంగమంతా దృష్టిసారించి శాశ్వత పరిష్కారం చూపిస్తుంది.